## చార్మినర్ జోన్‌లోకి మార్చండి

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 5: మెదక్ జిల్లాను సిరిసిల్ల జోన్ నుంచి చార్మినార్ జోన్‌లోకి మార్చాలంటూ పలు సంఘాలు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డికి గురువారం వినతి పత్రం అందజేశారు. చార్మినార్ జోన్‌లో ఉంటేనే సౌలభ్యంగా ఉంటుందని ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు.

## మున్సిపల్ కమిషనర్‌గా రామకృష్ణారావు



నర్సాపూర్, సెప్టెంబర్ 5: మున్సిపాలిటీలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు తెలిపారు. కమిషనర్‌గా ఆయన గురువారం బాధ్యతలు చేపట్టారు.

## కుటుంబీకులకు వృద్ధురాలి అప్పగింత



చిలిపిచెడ్, సెప్టెంబర్ 5: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరుకు చెందిన పట్లోళ్ల నర్సమ్మ చిలిపిచెడ్ మండలం చిట్కుల్‌లోని మెదక్-సంగారెడ్డి రోడ్డు పక్కన నిలబడి ఉండడంతో పోలీస్ సిబ్బంది దేవీసింగ్, లక్ష్మణ్ గుర్తించి ఆమెను వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై యాదగిరి తెలిపారు.

## హామీలు మరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం: డీబీఎఫ్

నిజాంపేట, సెప్టెంబర్ 5: ఉపాధి కూలీలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిందని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. గురువారం ఆయన నిజాంపేటలో మాట్లాడుతూ ఉపాధి కూలీలకు ఏడాదికి రూ.12 వేలు, బీమా పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే హామీలు అమలు చేయాలని లేకుంటే రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు. ఆయనతో జిల్లా అధ్యక్షుడు దుబాషి సంజీవ్, బాబు, బండారి ఎల్లం ఉన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



శివ్వంపేట, సెప్టెంబర్ 5: గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గోమారం గ్రామంలో సుమారు 35 నుంచి 40 ఏండ్ల వయస్సు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి పంచాయతీ రోడ్డులో గురువారం మృతి చెంది కనిపించాడు. గ్రామంలో మూడు నాలుగు రోజులుగా కనిపిస్తున్నాడన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్




**WANTED**

★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16 K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640258899 / 9640468899.
NT-331758-All

**BUSINESS OFFER**

★ SSS GRAPHICS Wanted District Wise Franchisees & also Distributors for 2025 Diaries and Calendars. Cont: 8639471849, 8790523529, Hyderabad.
NT-331739

**CHANGE OF NAME**

★ I, YASMEEN BEGUM, W/o. Mohammed Naseer Uddin Qureshi (Old Name), R/o. H.No. 3-75/2, Mogudapally Village & Mandal, Sangareddy Dist., have Changed My Husband Name YASMEEN BEGUM, W/o. MOHAMMED NASEER QURESHI (New Name).
NT-N-Reddy

★ I, NASEER AHMED, S/o. Azam Ali (Old Name), R/o. H.No. 3-75/2, Mogudampally Village & Mandal, Sangareddy Dist., have Changed My Name as MOHAMMED NASEER QURESHI, S/o. MD. AZAM ALLI (New Name).
NT-N-Reddy

**CHANGE OF D.O.B.**

★ I, MOHAMMED NASEER QURESHI, S/o. MOHAMMED AZAM ALLI (Old Name), R/o. H.No. 3-75/2, Mogudampally Village & Mandal, Sangareddy Dist., have Changed My Date of Birth Date: 10-06-1976 to 01-01-1981 (My Correct Date of Birth Date: 01-01-1981) (New).
NT-N-Reddy

★ I, YASMEEN BEGUM, D/o. MOHAMMED MOINUDDIN (Old Name), R/o. H.NO. 3-75/2, Mogudapally Village & Mandal, Sangareddy Dist., have Changed My Date of Birth: 01-01-1987 to 08-08-1983 (Correct Date of Dob: 08-08-1983).
NT-N-Reddy

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకం



ఉత్తమ ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్ తదితరులు

- ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి
- ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి
- కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 5: గురువు అంటే 'మార్గదర్శి' నిపుణుడు, ఉపాధ్యాయుడు. భారతీయ సంప్రదాయంలో గురువు అందరికంటే ఉన్నతుడని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. గురువారం సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో గురువును బ్రహ్మ విష్ణు మహేశ్వరులతో పోల్చారని, గురువు స్థానం ఎంతో గొప్పదని తెలుస్తున్నదన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అన్నారు. రాధాకృష్ణన్ జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. తల్లిదండ్రుల తర్వాత విద్యార్థులను అంత ప్రభావితం చేయగల వ్యక్తి ఉపాధ్యాయుడు మాత్రమే అన్నారు. జిల్లాలో ఎంపికైన 53 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో డీఈవో రాధాకిషన్, సెక్టోరియల్ అధికారి సుదర్శన మూర్తి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, ఎంఈవో నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.



రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాలులర్పిస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్

# వరదతో భారీ నష్టం

- నీట మునిగిన పంటలు
- పలు చోట్ల కూలిన ఇండ్లు
- ధ్వంసమైన రోడ్లు, కల్వర్టు



చిలిపిచెడ్: చండూర్‌లో నీటిలో మునిగిన పత్తి పంట



వరి పంటలో వర్షం నీరు



గుండ్లపల్లి కల్వర్టు



రామాయంపేట: కూలిన ఇంటివద్ద తల్లీకూతురు

చిలిపిచెడ్, సెప్టెంబర్ 5: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని చిలిపిచెడ్, చండూర్, చిట్కుల్, అజ్జమర్రి, సోమక్కపేట తదితర గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. పత్తి, వరి, కంది సహా ఇతర పంటల్లో నష్టం వాటిల్లింది. వెంటనే వ్యవసాయాధికారులు సర్వే చేసి పంట నష్టాన్ని అంచనా వేయాలని రైతులు కోరుతున్నారు.

**కూలిన పెంకుటిల్లు**

రామాయంపేట, సెప్టెంబర్ 5: అక్కన్నపేటలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి మల్లుపల్లి అనుసూయకు చెందిన పురాతన ఇల్లు కూలిపోయింది. తన కూతురు శ్రీదేవితో ఇంట్లో పనులు చేసుకుంటుండగానే సగభాగం కూలింది. ఇంట్లో పెద్ద దిక్కులేక కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇల్లు కూలడంతో నిరాశ్రయులయ్యారు. దీంతో ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

**శిథిలావస్థలో దొంతి, గుండ్లపల్లి మధ్య కల్వర్టు**

శివ్వంపేట, సెప్టెంబర్ 5: దొంతి, గుండ్లపల్లి గ్రామాలకు ప్రధాన రహదారిపై మధ్య గల ఎల్లమ్మ గుడి వద్దనున్న కల్వర్టు శిథిలావస్థకు చేరిందని, ఎప్పుడు కూలుతుందోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. చెన్నరాయని చెరువు అలుగు పారే వాగుకు ఈ కల్వర్టు ఉన్నట్లు తెలిపారు. కల్వర్టు పూర్తిగా నాసిరకంగా, గోడలు మట్టితో కట్టి పైన స్లాబు వేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి కల్వర్టు కూలిపోక ముందే మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఆశవర్కర్లపై వేధింపులు ఆపాలి



అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

మెదక్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): ఆశ వర్కర్లపై వేధింపులు ఆపాలని ఆశ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు నర్సమ్మ డిమాండ్ చేశారు. ఆశ ఆలిండియా పిలుపులో భాగంగా మెదక్ కలెక్టరేట్ దగ్గర ఆశ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా వైద్యాధికారి శ్రీరాంకు ఆశ వర్కర్లు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ వర్కర్లు 20 ఏండ్లుగా పని చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పారితోషకాలు పేరిటితో శ్రమ దోపిడీ చేస్తున్నదన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి అనేక సేవలు అందిస్తున్న ఆశ కార్యకర్తలను ప్రభుత్వం చిన్నచూపు చూడడం అన్యాయమన్నారు. ఆశలు గ్రామాల్లో లేకపోతే పేదలకు సక్రమంగా ఆరోగ్య సేవలు అందవన్నారు. తమ ప్రాణానికి తెగించి సేవలు అందిస్తున్నప్పటికీ ఆరోగ్య బీమా, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించడంలో విఫలమైందన్నారు. వెయ్యి మంది జనాభాకు ఒకరు పని చేయాల్సింది పోయి రెండు, మూడు వేల మంది జనాభాకు ఒకరే ఆశ కార్యకర్త విధులు నిర్వహిస్తున్నదన్నారు. పని భారం ఎక్కువ అవుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ పథకాలు అమలుచేసినా ఆశ కార్యకర్తల ద్వారానే సర్వేలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధరలకు అనుగుణంగా రూ.26 వేలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

## బీవీఆర్ఐటీలో జాతీయ స్థాయి డిమక్స్ హ్యాకథాన్




మాట్లాడుతున్న టీసీఎస్ కన్సల్టెంట్, డెలివరీ హెడ్ దిబికర్ పాణిగ్రహి

నర్సాపూర్, సెప్టెంబర్ 5: నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కళాశాలలో జాతీయ స్థాయి 24 గంటల డిమక్స్ హ్యాకథాన్ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. కార్యక్రమానికి టీసీఎస్ కన్సల్టెంట్, డెలివరీ హెడ్ దిబికర్ పాణిగ్రహి ముఖ్య అతిథిగా, వివిధ రాష్ట్రాల నుంచి 123 గ్రూపుల విద్యార్థులు పాల్గొన్నారు. డిమాక్స్ హ్యాకథాన్‌లో విద్యార్థులకు ఇచ్చిన స్మార్ట్ అగ్రికల్చర్, స్మార్ట్ హెల్త్, స్మార్ట్ ఎడ్యుకేషన్, సాంకేతిక మార్గాలు రూపొందించినట్లు తెలిపారు. కళాశాల డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ఐటీ అధిపతి దశరథ రామయ్య, సీఎస్బీఎస్ అధిపతి భీమా డిమక్స్ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.

## పనిచేయని సర్వర్లు.. ఇబ్బందుల్లో రైతులు



సర్వర్లు పని చేయకపోవడంతో బ్యాంకు బయట పడిగాపులు గాస్తున్న రైతులు

తూప్రాన్, సెప్టెంబర్ 5: తూప్రాన్‌లోని ఎస్‌బీఐలో సర్వర్లు పని చేయకపోవడంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బ్యాంకు లోపలికి ఎవరినీ అనుమతించలేదు. దీంతో మండలంలోని పలు గ్రామాల రైతులు బ్యాంకు ఆవరణలో పడిగాపులు కాశారు. రుణాలు మాఫీ అయ్యాయో లేదో తెలుసుకునేందుకు కొందరు వ్యవసాయ శాఖాధికారుల దగ్గర నుంచి బ్యాంకులకు చక్కర్లు కొట్టారు. కొత్తరుణాల కోసం మరి కొందరు రైతులు మూడు నాలుగు వారాలుగా బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని వాపోయారు. ఇదే విషయమై ఎస్‌బీఐ మేనేజర్ రామేశ్వర్‌ను వివరణ కోరగా బుధవారం సాయంత్రం నుంచి సర్వర్ సమస్య ఉన్నదని, దీనికి తోడు సర్వర్ మార్పిడి చేయడంతో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బ్యాంకు సేవలకు తాత్కాలిక అంతరాయం ఏర్పడిందన్నారు. మధ్యాహ్నం తర్వాత యథావిధిగా కార్యకలాపాలు కొనసాగాయన్నారు.

**నెలరోజులుగా తిరుగుతున్నా**



మాకు ఐదెకరాల పొలం ఉంది. 2018లో నా పేరిట రూ.లక్ష, నా భార్య కాకల్ల నీలమ్మ పేరిట రూ.2 లక్షల రుణం తీసుకున్నాం. రూ.2 లక్షల రుణమాఫీ అన్నారు. కానీ నా పేరిట ఉన్న లక్ష మాఫీ కాలేదు, నా భార్య పేరిట ఉన్న రూ.2 లక్షల రుణమాఫీ కాలేదు. వ్యవసాయ అధికారులు, బ్యాంకుల చుట్టూ నెలరోజులుగా తిరుగుతున్నా, నా సమస్య పరిష్కారం కావడం లేదు.

**- కాకళ్ల ఐయల్లం, రైతు, వెంకటాయపల్లి, తూప్రాన్ మండలం**

## విమర్శలు మాని ప్రొటోకాల్ పాటించాలి



మాట్లాడుతున్న ఎంపీపీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు హరికృష్ణ తదితరులు

శివ్వంపేట, సెప్టెంబర్ 5: కాంగ్రెస్ నాయకులు విమర్శలు మాని ప్రొటోకాల్ పాటించాలని ఎంపీపీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు కల్లూరి హరికృష్ణ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్ అన్నారు. గురువారం శివ్వంపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అధికారం ఉంది కదా అని విర్రవీగుతున్న కాంగ్రెస్ నాయకులు నర్సాపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పట్ల ప్రొటోకాల్ ఉల్లంఘిస్తున్నారని మండిపడ్డారు. ఖమ్మంలో వరదలతో ప్రజలు అల్లాడుతుంటే ఆదుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని, పరామర్శించేందుకు వెళ్లిన ప్రతిపక్ష పార్టీ నాయకులైన హరీశ్‌రావు బృందంపై దాడి చేయడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకుల జోలికి వస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. సమావేశంలో వెల్దుర్తి మాజీ జడ్పీటీసీ రమేశ్, గ్రామకమిటీ అధ్యక్షుడు ముద్దగల్ల లక్ష్మీనర్సయ్య, రేణుకుమార్, కొండల్, రాజుకుమార్, సత్య నారాయణ తదితరులు ఉన్నారు.

## అంగన్‌వాడీకి ఎల్ఈడీ టీవీ బహూకరణ



నిజాంపేట, సెప్టెంబర్ 5: జడ్చెరువు తండాలోని అంగన్‌వాడీ కేంద్రానికి అదే గ్రామానికి చెందిన డాక్టర్ మోహన్‌నాయక్ ఎల్ఈడీ టీవీని గురువారం బహూకరించారు. ఏబీసీడీలు, వివిధ రకాల బొమ్మలు సులభంగా నేర్చుకునేందుకు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజు, లోక్యా, ధన్‌రాజ్, కిశోర్, మహేందర్, మహేశ్, రాజ్య గోపాల్ ఉన్నారు.

## తూప్రాన్ పెద్ద చెరువు కట్టపై ప్రత్యేక పూజలు

తూప్రాన్, సెప్టెంబర్ 5: తూప్రాన్ పెద్ద చెరువు నిండి అలుగు పారుతుండటంతో జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ గడప దేవేందర్, తూప్రాన్ మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్ గురువారం కట్టపై గంగమ్మకు పూజలు చేశారు. నలభై ఏండ్లలో కేవలం మూడు, నాలుగు సార్లు మాత్రమే పెద్ద చెరువు నిండింది. ఈసారి కూడా చెరువు నిండడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



తూప్రాన్ పెద్ద చెరువు కట్టపై పూజలు చేస్తున్న గడప దేవేందర్

# పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి



తూప్రాన్, సెప్టెంబర్ 5: పండగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి అన్నారు. ఈనెల 7న వినాయక చవితి, 16న ఈద్ మిలాద్ ఉన్ నబీ సందర్భంగా పీస్ కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ నందాల శ్రీనివాస్, సీఐ రంగకృష్ణ, ఎస్ఐ శివానందం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

**అల్లాదుర్గంలో..**

అల్లాదుర్గం, సెప్టెంబర్ 5: అల్లాదుర్గం, టేక్మాల్ పోలీస్‌స్టేషన్లలో శాంతి కమిటీ సభ్యులతో అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి సమావేశం ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పండుగలు నిర్వహించాలన్నారు. సమావేశంలో అల్లాదుర్గం ఎస్సై ప్రవీణ్‌రెడ్డి, టేక్మాల్ ఏఎస్సై దయానంద్ పాల్గొన్నారు.

**రామాయంపేటలో..**

రామాయంపేట, సెప్టెంబర్ 5: గణేష్ మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతులు తీసుకోవాలని సీఐ వెంకటరాజగౌడ్ సూచించారు. సర్కిల్‌లోని రామాయంపేట, నిజాంపేట, చిన్నశంకరంపేట, చేగుంట మండలాల వ్యాప్తంగా నిర్వాహకులు ఆన్‌లైన్ దరఖాస్తులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సిద్దిరాంరెడ్డి, ఆంజనేయులు ఉన్నారు.

**చిన్నశంకరంపేటలో..**

చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 5: గణపతి మండలపాల వద్ద డీజేలకు అనుమతి లేదని ఎస్సై నారాయణ తెలిపారు. చిన్నశంకరంపేట పోలీస్ స్టేషన్ శాంతి కమిటి సమావేశాన్ని నిర్వహించారు.

# ఇకపై ప్రగతి ధర్మారం




డి.ధర్మారం గ్రామ పంచాయతీ భవనం ప్రగతి ధర్మారంగా ప్రభుత్వ జీవో

రామాయంపేట, సెప్టెంబర్ 5: దొంగల ధర్మారంగా పేరున్న గ్రామం నేడు ప్రగతి ధర్మారంగా మార్చబడింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవోను విడుదల చేసిందని గ్రామ కార్యదర్శి మహేందర్ గురువారం తెలిపారు. దొంగల ధర్మారం పేరును ప్రగతి ధర్మారంగా మార్చాలని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోరారు. దీంతో ప్రభుత్వం గ్రామస్తుల ఇబ్బందులను గుర్తించి ప్రగతి ధర్మారంగా మార్చేందుకు కృషి చేసింది.

## ఘనంగా పోషణ్ అభియాన్



బాలింతలు, గర్భిణులకు సూచనలిస్తున్న జిల్లా సంక్షేమ అధికారి బ్రహ్మాజీ

అల్లాదుర్గం, సెప్టెంబర్ 5: గర్భిణులు పేరు నమోదు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి బ్రహ్మాజీ సూచించారు. పెద్దాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బంది ఇచ్చే సలహాలు పాటిస్తూ పోషకాహారం, మాత్రలు వేసుకోవాలన్నారు. ఆర్నెళ్ల వరకు బాలింతలు తప్పకుండా పిల్లలకు తల్లిపాలే పట్టాలన్నారు. కార్యక్రమంలో అల్లాదుర్గం ప్రాజెక్ట్ సీడీపీవో పద్మలత, సిబ్బంది నాగమణి, జిల్లా సమన్వయకర్త వెంకట్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ దాడులకు బీఆర్ఎస్ భయపడదు



బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు లక్ష్మణ్

చిలిపిచెడ్, సెప్టెంబర్ 5: వరద బాధితుల ఇబ్బందులు తెలుసుకుని, వారికి అండగా ఉండేందుకు ఖమ్మంకు వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ గూండాలు దాడులు చేయడం దుర్మార్గమని పార్టీ మండల ఉపాధ్యక్షుడు బెస్త లక్ష్మణ్ అన్నారు. గురువారం మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, సబిత ఇంద్రారెడ్డి, పలువురు ఎమ్మెల్యేల కార్లపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడులను ఆయన ఖండించారు. కాంగ్రెస్ వాళ్ల దాడులకు బీఆర్ఎస్ నాయకులు భయపడరని పేర్కొన్నారు.

## ఆటో డ్రైవర్‌ను కఠినంగా శిక్షించాలి



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నేతలు

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 5: ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీ మహిళపై హత్యాచారయత్నానికి పాల్పడ్డ ఆటో డ్రైవర్‌ను కఠినంగా శిక్షించాలని బీజేపీ మహిళా మోర్చా డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు వీణ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సంగీత, ఎంఎల్ఎన్ రెడ్డి, ప్రసాద్, శివ, విఠలేశ్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత




శివ్వంపేట, సెప్టెంబర్ 5: చండి గ్రామానికి చెందిన శివన్నగారి భూపాల్ కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం, నెలకు సరిపడా నిత్యావసర సరుకులను మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా గురువారం అందజేశారు. పిల్లుట్ల గ్రామానికి చెందిన మొనగారి మల్లేశం కుటుంబానికి సంఘ సేవకుడు బండారి గంగాధర్, ఐడీపీఎల్ శ్రీనివాస్‌గౌడ్, చౌటపూర్ శ్రీనివాస్‌గౌడ్ రూ.10వేలు, 50 కిలోల బియ్యం అందజేశారు. వారితో ప్రవీణ్‌గౌడ్, నవీన్‌కుమార్, మల్లారెడ్డి, ఆంజనేయులుగౌడ్, మహేశ్ ఉన్నారు.

## వరద బాధితులకు ఆర్థిక సాయం



చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 5: ఖమ్మం జిల్లా వరద బాధితులకు జిల్లా ఫొటోగ్రాఫర్స్ యూనియన్ అధ్యక్షుడు బిట్ల నర్సింలుకు మండల అధ్యక్షుడు కుమ్మరి మహేశ్, ఉపాధ్యక్షుడు మల్లాగౌడ్, బసవరాజు రూ.5వేల ఆర్థిక సాయాన్ని గురువారం అందజేశారు.



రామాయంపేట, సెప్టెంబర్ 5: రామాయంపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో దివంగత ఉపాధ్యాయుడు ఐరేని రవీందర్‌గౌడ్ పెద్ద కర్మకు డీఈవో రాధాకృష్ణ గురువారం హాజరై నివాళులర్పించారు. కార్యక్రమంలో రామాయంపేట ఎంఈవో నీలకంఠం, టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రణీద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఐలయ్య, గౌరవ అధ్యక్షులు ఇంద్రసేనాచారి, నర్సింహ్మారావు ఉన్నారు.

## విద్య, ఉద్యోగుల సమస్యలపై ఎమ్మెల్సీకి వినతి



వెల్దుర్తి, సెప్టెంబర్ 5: విద్యా, ఉద్యోగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్సీ కోదండరాంకు ఎస్‌జీటీ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మహిపాల్‌రెడ్డి, వెంకటేశం గురువారం వినతిపత్రం అందజేశారు.

## రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 5: జిల్లాలోని 151 సీనియర్ సెకండరీ, సెకండరీ పాఠశాలలు, 40 ఉన్నత పాఠశాలల్లో బాలికల కోసం రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ్-స్వీయ రక్షణ కార్యక్రమాన్ని 3 నెలల పాటు నిర్వహించేందుకు కరాటేలో బ్లాక్‌బెల్ట్ సాధించిన వారు (సెప్టెంబర్ 2024 నుంచి ఫిబ్రవరి 2025 వరకు) ఈ నెల 10వ తేదీలోగా డీఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో రాధాకిషన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు.